# గుండె గొంతుకల్లో

వైశాలి. జి

చలి ... ఈదురు గాలి ... నన్నుని తుంపర.

సెకండ్ షో చూసి బయటి కొచ్చిన మమ్మల్ని ఒక్కసారిగా చలి గజగజ లాడించింది. భుజం మీదున్న చిన్నదానికి షాల్ కప్పుతూ మరింత దగ్గరగా తీసుకున్నాను. ఇద్దరం ఉద్యోగస్తులం కావడంతో కాస్త ఖాళీ దొరికితే చూడగలిగేది సెకండ్ షోయే.

ఆయన "ఆటో ! .. రిక్షా! ..." అంటూ అటూ ఇటూ పరుగెడుతున్నారు. సినిమాకి వెళ్ళిన ప్రతిసారీ ఇదే గొడవ. రిక్షాగాని, ఆటోగాని ఓ పట్టాన దొరకదు. త్వరగా ఏదో ఒకటి దొరికితే బాగుణ్ణు.

ఈ తుంపరలో పిల్ల లిద్దరినీ పట్టుకుని నిలబడటం చిరాకుగా ఉంది. సినిమా చూశామన్న ఆనందం ఏ మాత్రం లేదు.

చిన్నది అటూ, ఇటూ కదిలింది. 'లేచింది కదా' అని కిందకి దింపాను. ఏడుపు మొహం పెట్టిందల్లా దాని బూట్లు 'కీ కీ' మని శబ్దం చేయగానే ఏడుపు ఆపేసి ఆ బూట్ల వైపు చూసుకుంటూ అటూ ఇటూ నడవడం మొదలుపెట్టింది.

లేత పింక్ కలర్‌లో వెల్వెట్‌లా మెరిసిపోతూ ముద్దుగా ఉన్నాయి బూట్లు. వాటిని ఫారిన్‌లో ఉన్న మా అన్నయ్య దీని మొదటి పుట్టిన రోజుకి పంపించాడు. నేను వాటిని ఎంతో అపురూపంగా దాచి, అప్పు డప్పుడూ వేస్తుంటాను. ఈయ నేమో "అలా దాచు. ఈ లోపల పాదాలు పెరిగి బూట్లు సరిపోకపోతే ఎవరికైనా ఇచ్చేయొచ్చు" అన్నారు. అదీ నిజమే అనిపించి ఇలా ఈ రోజు సినిమాకి వేశాను.

ప్చ్! ఇంకా దొరకలేదా రిక్షా? చూస్తుంటే వర్షం పెద్ద దవుతోంది.

ఇంతలో నా వెనకాల రిక్షా బెల్లు. దానితోపాటు "అమ్మా రిక్షా కావాలా?" అనే పిలుపు.

"లబ్బీ పేట వస్తావా? ... నాల్రూపాయలా?"

పరవాలేదు బేరం బాగానే ఉందని మా ఆయన్ని పిలిచాను. రిక్షా ఎక్కాం. రిక్షా ఎక్కడమే ఆలస్యం పిల్ల లిద్దరూ చెరొకరి ఒళ్ళో నిద్రపోయారు.

రిక్షా అతను భారీగా నల్లగా ఉన్నాడు. మునలతను. నెమ్మదిగా తొక్కుతున్నాడు.

ఇంత చలిలో ఇంటికి ఎప్పుడు వెళతామో, ఏమో! అనుకుని "ఎంతసేపయ్యా బాబూ! త్వరగా తొక్కు" అని విసుక్కున్నాను.

అతను ఏం మాట్లాడలేదు. కనీసం స్పీడు పెంచుతున్నట్లైనా నా కనిపించలేదు. 'ఇలా నెమ్మదిగా తొక్కి ఎవరూ లేని చోట ఏ గొలుసో లాక్కోడు కదా!' అనిపించింది. ఇల్లు చేరడంతోటే సగం తడిసిన నేను గబగబా పిల్లల్ని తీసుకుని లోపలకు పరుగెత్తాను.


మర్నాడు పొద్దున్నే ఆఫీసుల హడావుడి.

"అమ్మా! చూ .." అంటూ వచ్చింది.

దాని స్కూలు షూ వెతికి తీయబోయాను. కాలు వెనక్కి లాక్కొని "కీ కీ .. చూ..." అంది. 'సరే! ఏదో ఒకటి వేద్దాం' అని వాటి కోసం చూశాను. స్టాండ్‌లో లేవు. వరండాలోనూ లేవు.

"అయ్యో! బూట్లండీ! చిన్నదానివి కనిపించడంలేదు. నిన్న రిక్షాలో





పడిపోయుంటాయి. మీరు చూడలేను. నేనూ గమనించలేదు. ఫారిన్ బూట్లండీ. నాలుగుసార్లు వేశానేమో అంతే! ఎంత బావుండేవే, వాడు చక్కగా రిక్షాలో ఉన్నాయిగా, పట్టుకుపోయుంటాడు. పోనీ మీరు ఓ పని చేయకూడదూ? మళ్ళీ సినిమా హాలు దగ్గరకి వెళ్ళి వాడి కోసం ట్రై చేయండి. లేకపోతే మిగతా రిక్షా వాళ్ళతో వాడి గుర్తులు చెప్పి వెతకండి'' అని గబగబా, కంగారుగా అన్నాను.

''చాల్చాల్లే! మతిపోయిందా? వెధవ బూట్ల కోసం ... అవతల ఆఫీసుకు టైం అవుతుంటే సినిమా హాళ్ళ వెంబడి, రిక్షా స్టాండ్‌ల వెనకాల తిరగాలా నేను?'' అని కసిరారు.

నాకు మనసులో బాధగా అనిపించింది. అన్నయ్య ప్రేమతో ఫారిన్ నుంచి పంపాడు. ఇక్కడ కొందామన్నా దొరకవు. రిక్షావాడు లక్కీ ఫెలో. ఎవరికో అమ్ముకోవడమో, వాడి పిల్లలకు వేయడమో చేస్తాడు. నాలుగు రూపాయలకు చౌక బేరం వచ్చా డనుకున్నానే గాని అంతకు డబుల్ వాడికి దక్కింది అని కసురుకుంటూ నేనూ ఆఫీస్‌కి తయారవడం మొదలుపెట్టాను.

ఇంతలో ఎవరో తలుపు తట్టినట్టు అనిపించింది. ''ఎవరూ?'' అంటూ తలుపు తీసి ఒక అడుగు వెనక్కి వేశాను.

ఎదురుగా పొడుగ్గా, నల్లగా, చేతిలో బూట్లతో నిన్నటి రిక్షా అతను. ముందు ఆనందంతో బూట్లు లాక్కున్నంత పని చేశాను.

''రాత్రే నగం దూరం వెళ్ళాక చూశానమ్మా! వెనక్కి తిరిగి తెద్దా మనుకున్నాను గాని, గాలిలో రిక్షా తొక్కలేక జ్వరం ఎక్కువైన ట్టనిపించిం దమ్మా! దాంతో ఈ గాయం బా ధొకటి'' అంటూ కాలు చూపించాడు. ''రాత్రి మీదే చివరి బేరం. అందుకే ఇల్లు గుర్తుంచుకుని మళ్ళీ వచ్చా'' నన్నాడు.

అయ్యో పాపం! కాలికి దెబ్బ ఉండటం వల్లే అంత నెమ్మదిగా తొక్కాడు. ఈదురు గాలిలో నా మాట వినిపించి ఉండదు. అందుకే సమాధానం ఇవ్వలేదు. నేనేమో ఏదో ఊహించాను. నా మనసు బాధగా మూలిగింది. ఒంటినిండా సరైన బట్ట లేక జ్వరంతో ఆ చలిలో ఇంత నెంత బాధపడ్డాడో! పర్సు తీసి - ''ఈ అయిదు రూపాయలు ఉంచు'' అన్నాను.

''లేదమ్మా! నేనే మీ కియ్యాల. అయ్యగారు చూసుకోకుండా రేతిరి నాకు ఒక రెండు ఎక్కువిచ్చినా రమ్మా! ఇదిగో అమ్మా అది!'' అంటూ చెయ్యి చాపాడు.

''రండమ్మా మిమ్మల్ని ఆఫీసు దగ్గర దిగబెడత! ఏదైనా పని చేస్తే డబ్బు ఇయ్యండమ్మా! ఊర్కే వద్దు'' అన్నాడు.

నా తల సిగ్గుతో వాలిపోయింది. ఇతని నిజాయితీకేనా నేను వెల కట్టింది? ఇతని గురించేనా రాత్రి నే నలా తప్పుగా అంచనా వేసింది? కాని అతను తను చేసిన పనికి మాత్రం విలువ కట్టుకున్నాడు. ఇక మిగతా దేనికీ అతనేమీ ఆలోచించలేదు. నాకు ఒక్కసారే నాకే తెలియని భావనతో గుండె గొంతుకలో ఉన్నట్టనిపించింది.

★